క్లుప్తంగా

ఘనంగా అభయ త్రిశక్తి బోనాల ఊరేగింపు



చీడిగలో బోనాలుతో మహిళల ఊరేగింపు

కాకినాడ రూరల్: ఆషాఢ మాసం ముగింపు సందర్భంగా మండంలోని చీడిగ గ్రామంలో అభయ త్రిశక్తి అమ్మవారి ఆలయంలో బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 108 బోనాలతో మహిళలు ఆదివారం రాత్రి గ్రామంలో పర్యటించారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు కొప్పిశెట్టి గణేష్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

ఓటర్ల జాబితా తనిఖీ



మత్స్యకార మహిళను ఓటు గురించి అడుగుతున్న ఈఆర్ఓ సత్యనారాయణ, తహసీల్దార్ మురార్జీ

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి గ్రామం పోలింగ్ స్టేషన్ 35 పరిధిలోని ఫిషింగ్ హార్బర్ పేటలో ఓటర్ల జాబితాను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు ఓటర్ల జాబితాకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలన జరుగుతుందని, బూత్ స్థాయి అధికారులు సన్నద్ధంగా ఉండాలన్నారు. తహశీల్దార్ వీరవల్లి మురార్జీ, తదితరులు పాల్గొన్నారు.

23న జిల్లా స్థాయి యోగా పోటీలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23న జేఎన్‌టీయూ స్టూడెంట్ ఎమినిటీ భవన్‌లో జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కో–ఆర్డినేటర్ సీహెచ్ సుధాదేవి సోమవారం తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో 9 నుంచి 14 ఏళ్లు, జూనియర్ కేటగిరిలో 14 నుంచి 18 ఏళ్లు, సీనియర్ కేటగిరిలో 18 నుంచి 28 ఏళ్ల వయస్సు గల స్త్రీ, పురుషులు అర్హులని 21వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ట్రెడిషనల్, ఆర్టిస్టిక్స్ సోలో, ఆర్టిస్టిక్ పెయిర్, రిథమిక్ పెయిర్ విభాగాల్లో పోటీలు ఉంటాయని, ఇందులో ప్రతిభ చూపిన వారు జాతీయ క్రీడా యువజన శాఖ నిర్వహించే ఇండియా గేమ్స్‌లో పాల్గొనడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు 91334 33491 నెంబరును సంప్రదించవచ్చన్నారు.

ఈనాం రైతులకు పట్టాలు ఇవ్వాలి

కాకినాడ సిటీ: ప్రత్తిపాడు మండలం చింతలూరు గ్రామంలో ఈనాం భూములను సాగు చేస్తున్న రైతులకు తక్షణం పట్టా ఇవ్వాలని రైత్వారీ హక్కుల సాధన కమిటీ కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేసింది. ఈ ధర్నాకు వామపక్షాలు సంఘీభావం తెలిపారు. కమిటీ నాయకులు బుగత బంగార్రాజు, డి.హరనాథ్, తాడి నాగేశ్వరరావు, పీఎస్ అజయ్‌కుమార్, బోడకొండ బాబు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ జాన్‌పాల్ కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న మండల పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

కరప: కత్తిపూడి సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బిలీవర్స్ ఈస్టన్ చర్చి సామర్లకోట ఏరియా లీడర్, పాస్టర్ జాన్‌పాల్‌కు మండల పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గ సభ్యులు సోమవారం ఏపీ మల్లవరంలో సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా రూ.21,500 ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ పి.డేవిడ్‌రాజు, వైస్ ప్రెసిడెంట్ జె.పాల్‌ప్రసాద్, సెక్రటరీ ఆర్.ప్రతాప్‌కుమార్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

19న డయల్ యువర్ డీఎం

కాకినాడ: ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 19న డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్టు కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూపీ మనోహర్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి 11.30 మధ్యలో ప్రజలు ఫోన్ ద్వారా సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. 99592 25534 నెంబర్‌కు ఫోన్ చేసి తమ సూచనలు, సలహాలు ఇవ్వవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇద్దరికి జరిమానా

సామర్లకోట: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో ఇద్దరికి కోర్టు రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్టు సీఐ కె.దుర్గాప్రసాద్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకుని సోమవారం కాకినాడ కోర్టుకు హాజరుపరచగా జగ్గంపేటకు చెందిన క్రాంతి నాగేంద్ర, నందిగామకు చెందిన నరసింహారావులకు జరిమానా విధించినట్టు తెలిపారు.

98 శాతం హామీలు పూర్తి

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- కొంగోడులో జగనన్న సురక్ష

కరప: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 98 శాతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. మండలంలోని కొంగోడులో సర్పంచ్ నక్కా అప్పలస్వామి అధ్యక్షతన సోమవారం జగనన్న సురక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగవలసిన అవసరం లేకుండా ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను ఇంటి ముంగిటకే వలంటీర్లు అందజేస్తున్నారన్నారు. గ్రామంలో 430 కుటుంబాల వారికి ప్రయోజనం చేకూరిందన్నారు. ఎన్నికలు మరో ఏడాది ఉండటంతో పగటి వేషగాళ్లు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, భార్య, కుమారుడుతో రోడ్డెక్కి, రాష్ట్ర ప్రభుత్వంపై లేనిపోని బురదచల్లే కార్యక్రమాలు చేపట్టారని, ప్రతిపక్షాల ఆరోపణలను ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. పవన్‌కళ్యాణ్ వలంటీర్ వ్యవస్థను విమర్శించడం దారుణమన్నారు. అనంతరం అంగన్‌వాడీ చిన్నారులకు ప్రీస్కూలు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. అంతకు ముందు రూ.8 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. తర్వాత రూ.20 లక్షలతో నిర్మించే బీటీరోడ్డు, రూ.10 లక్షలతో నిర్మించే సీసీ డ్రెయిన్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజచేశారు. రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోట వెంకటేశ్వరరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, యండమూరు సర్పంచ్ మార్నెళ్ల శివ, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కొంగోడులో దరఖాస్తుదారుకు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



సర్పవరంలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ మురార్జీ తదితరులు

సర్పవరంలో..

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం సచివాలయం–2తో పాటు నియోజకవర్గంలోని 49, 50 డివిజన్లలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. సర్పవరంలో తహసీల్దార్ మురార్జీ, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, వీఆర్వోలు సాయి, శ్రీనివాస్, ఎంపీటీసీ రాజేష్, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు పుల్ల చందు పాల్గొని సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. 49, 50డివిజన్లలో మాజీ కార్పొరేటర్ ఐ.శ్రీను, రాష్ట్ర సివిల్ సప్లైస్ సంస్థ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, వైఎస్సార్ సీపీ నాయకులు పాలిక రమణ, కడియాల చిన్న తదితరులు పాల్గొన్నారు.

తూరంగిలో..

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ నియోజకవర్గం తూరంగి సచివాలయం–1 పరిధిలో జగనన్న సురక్ష నిర్వహించారు. మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బలగం ప్రసన్నకుమార్ పాల్గొని వివిధ అవసరాల కోసం దరఖాస్తు చేసుకున్న 186 ధ్రువపత్రాలను పంచాయతీ కార్యదర్శి జి.పాండురంగారావుతో కలసి అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లపల్లి బాబు, దాట్ల సత్యనారాయణ, పంపన రామకృష్ణ, దుగ్గన

సమాజ సేవలో రోటరీ

బోట్‌క్లబ్: సమాజ సేవలో రోటరీ ఎప్పుడూ ముందుంటుందని రోటరీ జిల్లా 3020 గవర్నర్ ఆర్‌వీ సుబ్బారావు అన్నారు. రోటరీహాల్‌లో సోమవారం రోటరీక్లబ్ ఆఫ్ కాకినాడ సన్‌రైజ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్లబ్ 2023– 24 సంవత్సరానికి క్లబ్ అధ్యక్షుడిగా గాదం వెంకట కమల్ సందీప్, కార్యదర్శిగా వీర నాగధర్‌తో పాటు కార్యవర్గ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రోటరీ చేసే కార్యక్రమాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కమల్ సందీప్ మాట్లాడుతూ రోటరీ నిర్దేశించిన అన్ని కార్యక్రమాలు, లక్ష్యాలను సాధిస్తామన్నారు. క్లబ్‌కు విశేస సేవలందించిన సుబ్రహ్మణ్యం, వీరబాబు, రంగారావు, హరిబాబుని సత్కరించారు.



నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట కమల్ సందీప్

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచండి

కరప: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని స్వచ్ఛ సర్వేక్షణ్ విభాగం కేంద్ర బృందం రానున్న నేపథ్యంలో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణలో పీర్ వెరిఫికేషన్, పంచాయతీ గణాంకాలను సిద్ధంగా ఉంచుకోవాలని, ఓడీఎఫ్ ప్లస్, సాలిడ్, లిక్విడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్, విజువల్లీ క్లీనెస్, ఫీకల్ స్లడ్జ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ఎ.వర్ధన్, ఏపీఓ ఈ.వెంకటరమణ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎం.గనిలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ, వివిధ శాఖ అధికారులు

స్టూడెంట్స్ ఒలింపిక్స్‌లో నవ్యారావుకు స్వర్ణ పతకాలు



స్వర్ణ పతకం సాధించిన నవ్యారావు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): మలేషియాలో ఈనెల 16 నుంచి 19 వరకు జరిగిన స్టూడెంట్ ఒలింపిక్స్ డబుల్స్ బ్యాడ్మింటన్‌లో కాకినాడకు చెందిన మద్రి నవ్యారావు ప్రతిభ కనపరిచి డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణ పతకాలు గెలుచుకుంది. హైదరాబాద్‌లోని రైల్వే అకాడమీలో కోచ్ గోవర్దన్ వద్ద ఆమె శిక్షణ పొందుతోంది. గతంలో శ్రీలంక, ఇండోనేషియా, మలేషియా, హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీలలో పాల్గొని ఐదు అంతర్జాతీయ స్థాయి పతకాలు కైవసం చేసుకుంది. హైదరాబాద్ సెయింట్ మేరీస్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసింది. తండ్రి తాతారావు ఎస్సీ కార్పొరేషన్‌లో డివిజనల్ ఇంజినీర్‌గా పనిచేసి పదవీవిరమణ పొందారు. తల్లి సుశీల గృహిణి. వరల్డ్‌లో టాప్ 10 ప్లేయర్‌గా కావాలన్నది తన లక్ష్యమని ఆమె వివరించింది. ఫార్చ్యూన్ వ్యూ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఎండీ విజయ్, శ్రీలక్ష్మి సౌజన్యంతో ఈ పోటీల్లో పాల్గొన్నట్టు నవ్య తెలిపారు.

శాకంబరిగా అన్నపూర్ణేశ్వరి



వివిధ రకాల పండ్లు, కూరగాయల అలంకరణలో విశ్వేశ్వరస్వామి ఆలయం



కూరగాయల అలంకరణలో అన్నపూర్ణమ్మ

బోట్‌క్లబ్: ఆషాఢమాసం సందర్భంగా స్థానిక రామారావు పేటలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని సోమవారం మూడు టన్నుల కూరగాయలతో అలంకరించారు. అమ్మవారి గర్భాలయంతో పాటు, అలయ పరిసరాలను ఎంతో అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దేవదాయశాఖ డీసీ, కార్యాలయ సూపరింటెండెంట్ కనపర్తి నాగేశ్వరరావు దర్శించుకున్నారు.

సత్తెమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే కురసాల

కాకినాడ రూరల్: మండలంలోని తమ్మవరం గ్రామ పరిధిలోని పాముగుంటలో సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని ఆయన గ్రామస్తులకు హామీ ఇచ్చారు. తమ్మవరం వైఎస్సార్ సీపీ నాయకుడు గొల్లపల్లి దొరబాబు, కోమలి సత్యనారాయణ, కర్రి గోపాలకృష్ణ, వాకలపూడి సుబ్బారావు, కొవ్వూరు సర్పంచ్ పిల్లి చక్రరావు తదితరులు పాల్గొన్నారు.

19న క్రికెట్ క్రీడాకారిణుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శివకుమార్ పర్యవేక్షణలో 2023–24 సంవత్సరానికి ఈనెల 19న వివిధ విభాగాల్లో క్రికెట్ క్రీడాకారిణుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి పి.సత్యనారాయణ సోమవారం తెలిపారు. స్థానిక రంగరాయవైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలోని క్రికెట్‌నెట్స్‌లో ఉదయం 8 గంటలకు ఎంపికలు ప్రారంభమౌతాయన్నారు. అండర్–15, 19, సీనియర్స్ విభాగంలో జరిగే ఎంపికలకు అండర్–15లో 2008 సెప్టెంబర్ ఒకటో తేదీ నాటికి, అండర్–19లో 2004 సెప్టెంబర్ ఒకటో తేదీ నాటికి జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు తెల్లదుస్తులు, బూట్లు ధరించి వయస్సు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా అంతర్జాతీయ న్యాయ దినోత్సవం

కాకినాడ రూరల్: అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో సోమవారం నిర్వహించారు. న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావును అడబాల రత్నప్రసాద్, రెడ్డం రాజా, రాఘవరావు, సత్యనారాయణ, రేలంగి బాపిరాజు, తదితరులు సన్మానించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రాథమిక హక్కులు పరిరక్షణ కోసం న్యాయ స్థానాలు కృషి చేయాలన్నారు. 1998 జూలై 17 నుంచి అంతర్జాతీయ న్యాయ దినోత్సవం జరుపుకొంటున్నారన్నారు.

ఎస్‌వోసీహెచ్ వినియోగంపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రమేష్

కాకినాడ క్రైం: హెచ్ఐవీ బాధితుల వివరాలను నెలవారీ విధానంలో ఎస్‌వోసీహెచ్ యాప్‌లో పొందుపరచాలని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రతినిధులు ల్యాబ్ టెక్నీషియన్లకు సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల పరిధిలో జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఎల్‌టీలకు స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రమేష్ పర్యవేక్షణలో ఈ శిక్షణ జరిగింది. ఎస్‌వోసీహెచ్ యాప్‌లో నెలవారీ బాధితుల వివరాల నమోదుపై శిక్షణ నిచ్చారు.

విద్యార్థులకు యూనిఫాం బహూకరణ

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు యూనిఫాం బహూకరించారు. హైస్కూలులో 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పోలిశెట్టి వెంకట బాపనయ్య, దేవు మాణిక్యాలరావు, ఎ.స్వామి, పి.మురళి, ఎస్‌వీ సత్తిపండు, టి.రఘుబాబు తదితర మిత్రులు సమకూర్చిన దుస్తులను 45 మందికి సోమవారం సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకుడు సాదే లోహిదాస్‌కుమార్ పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, హెచ్ఎం యు.లీలామనోహర్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న సర్పంచ్, పూర్వ విద్యార్థులు

వారి సేవలు మరువలేం



మా వలంటీరు పేరు కనకమహాలక్ష్మి మాకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయంటే దానికి కారణం ఆమె. మాకు ప్రభుత్వ పథకాలు ఎలా వస్తాయో తెలియదు. గతంలో ఇంటి పట్టాలు ఇస్తామని సభసమావేశాలకు రమ్మనేవారు. తీరా అయ్యాకా ఇంటికి రావడం తప్ప ఏ పథకం వచ్చిన దాఖలాలు లేవు. ప్రస్తుతం మా పిల్లలకు అమ్మఒడి పథకం గత నాలుగు సంవత్సరాలు వస్తోంది. నాకు ఇంటి పట్టా మంజూరు చేశారు. డ్వాక్రా రుణమాఫీ జరిగింది. ప్రభుత్వ పథకాలకు ఎలా దరఖాస్తు చేయాలో మాకు తెలియదు కానీ వలంటీర్ పుణ్యమా అని నేడు అన్ని ప్రభుత్వ పథకాలు తీసుకోగలుకుతున్నాం. కరోనా సమయంలో కూడా మాకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయో అని ఎంతో అప్యాయంగా పలికరించేది. ఆమె సేవలు ఎన్నిటికి మరువలేం.

– దడాల పద్మావతి, కరుసూదివారి వీధి, పేర్రాజుపేట 41వడివిజన్

సమస్యలు తెలుసుకునేందుకే వచ్చా..

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- కొవ్వూరు పంచాయతీలో గడప గడపకూ..

కాకినాడ సిటీ: సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని సత్వరం పరిష్కరించేందుకు మీ ఇంటి వద్దకే వచ్చానని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. మండలం కొవ్వూరు పంచాయతీ పరిధిలో సచివాలయం–2లో సోమవారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించి లబ్ధిదారులను ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. కాలువ గట్టును వెంబడి నివసిస్తున్న కుటుంబాలకు నేమాం గ్రామంలో ఇళ్ల స్థలాలు అందించామని, వీరంతా నేమాం వెళ్లి ఇళ్లు నిర్మించుకోవాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి చక్రరావు, ఉప సర్పంచ్ పబ్బినీడి రమేష్, ఎంపీటీసీలు ఊబా నాగమణి, కొండేటి లీలావతి, వార్డు సభ్యులు పంతాడి ధర్మారావు, దామలంక పల్లం రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు

పాఠశాలలను 'స్మార్ట్'గా తీర్చిదిద్దండి



స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ 38వ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

- కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (కేఎస్‌సీసీఎల్) ద్వారా చేపట్టిన ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, ప్రధానంగా పాఠశాలల అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ కోర్టు హాలులో 38వ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో ఆమె నగరపాలక సంస్థ కమిషనర్, కేఎస్‌సీసీఎల్ సీఈవో, ఎండీ మహేష్‌కుమార్‌తో కలసి సమీక్షించారు. మొదటిగా మార్చి 25న జరిగిన 37వ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాల కార్యాచరణపై చర్చించారు. అనంతరం సమ్మిళిత, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా స్మార్ట్ సిటీ మిషన్ కింద చేపట్టిన ప్రాజెక్టులు, పూర్తయిన పనులు, ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో పురోగతిని పరిశీలించారు. మూడు దశల్లో రూ.68.1 కోట్లతో చేపట్టిన పాఠశాలల అభివృద్ధి ప్రాజెక్టుల్లో రెండు దశలు ఇప్పటికే పూర్తయినందున రూ.32 కోట్లతో చేపట్టిన నాలుగు ప్యాకేజీల మూడో దశ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.వెంకటరావు, స్వతంత్ర డైరెక్టర్ టీవీఎస్ కృష్ణకుమార్, డైరెక్టర్ సందీప్ కుల్హారియా, కంపెనీ సెక్రటరీ ఎం.ప్రసన్నకుమార్, ఫైనాన్స్ మేనేజర్ సీహెచ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



క్విజ్ విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

విద్యార్థులకు కలెక్టర్ అభినందన

ఆర్థిక అక్షరాస్యతపై రిజర్వ్ బ్యాంకు నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలచిన జిల్లా పెదపూడి మండలం జి.మామిడాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను కలెక్టర్ కృతికా శుక్లా అభినందించారు. విజేతలైన కేవీ రామ్ మనోహర్, జి.కృష్ణతేజలను సోమవారం ఆమె కలెక్టరేట్‌లో అభినందించి ముున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఎల్‌డీఎం సీహెచ్ఎస్‌వీ ప్రసాద్, డీఈవో కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 14 అర్జీలు

కాకినాడ: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ ప్రజల వినతులను స్వీకరించారు. పారిశుద్ధ్యం, పింఛన్లు, తాగునీరు తదితర అంశాలకు సంబంధించి 14 దరఖాస్తులను ఆయా విభాగాలకు పంపించి సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఎస్ఈ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకట్రావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డీసీపీ కె.హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

డయల్ యువర్ కమిషనర్

ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్ నిర్వహించారు. కమిషనర్ మహేష్ కుమార్ సుమారు 20 మంది ఫోన్ ద్వారా చేసిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులకు పరిష్కారం కోసం పంపారు.



డయల్ యువర్ కమిషనర్‌లో మాట్లాడుతున్న మహేష్‌కుమార్

లయన్స్ విజన్ క్లబ్ కార్యవర్గం

బోట్‌క్లబ్: స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్‌లో సోమవారం లయన్స్ విజన్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రతిష్టాపనోత్సవం జరిగింది. క్లబ్ మాజీ గవర్నర్ వీఎస్‌వీడీ శివప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై క్లబ్‌లోని మహిళల సేవలను కొనియాడారు. నూతన అధ్యక్షురాలిగా మాండలిక ప్రసూన, కార్యదర్శిగా నల్లమిల్లి శ్రీదేవి, ఉపాధ్యక్షురాలిగా నారాయణం హిమబిందు, కోశాధికారిగా బులుసు శ్రీవాణి, మెంబర్‌షిప్ చైర్మన్‌గా తాళ్లం దేవికీదేవి, సర్వీస్ చైర్మన్‌గా చల్లా విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. నూతన అధ్యక్షురాలు ప్రసూన మాట్లాడుతూ క్లబ్ వ్యవస్థాపకురాలు దేవికీదేవి స్ఫూర్తి సహకారాలతో క్లబ్‌ను మరింత అభివృద్ధి చేస్తానన్నారు.



లయన్స్ విజన్ క్లబ్ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రసూన

బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో కాకినాడకు చెందిన బాంబ్ స్క్వాడ్ సోమవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. దీనిలో భాగంగా రైల్వే స్టేషన్ ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం పైకి వచ్చిన రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లోని బోగీలను తనిఖీలు చేశారు. రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ మాట్లాడుతూ ప్రయాణికులను అప్రమత్తం చేయడానికి మాక్ డ్రిల్ దోహదపడుతుందన్నారు. అనుమతి లేని సరకులను ప్రయాణికులు తీసుకువెళితే గుర్తించడానికి ఈ తనఖీల ద్వారా వీలు కలుగుతుందని చెప్పారు. బాంబ్ స్క్వాడ్ అధికారి ఏవీవీఎస్ వర్మ ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్ రామకృష్ణ, జీఆర్పీ ఎస్సై బి.లోవరాజు, స్టేషన్ మేనేజరు ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేసిన బాంబ్ స్క్వాడ్